

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలకు భారీ ఏర్పాట్లు

రేణిగుంట: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలకు సంబంధించి శ్రీకాళహస్తి బేరివారి మండపం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలపడానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో తగినట్లుగా వసతులు కల్పించే పనిలో ఉన్నారు . పార్టీ నాయకులు పట్టణంలో పలు సామాజిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టనున్నారు.

భానుడి భగభగ

బుచ్చినాయుడుకండ్రిగ: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 11 గంటలు దాటితే జనం బయటకు రావాలంటే భయపడుతున్నారు. మధ్యాహ్నం వేళ భానుడు నిప్పులు కక్కుతున్నాడు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎండ వేడిమికి వడదెబ్బ తగిలిన వారు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. పిల్లలు, వృద్ధులు ఉక్కపోతకు అల్లాడుతున్నారు. వర్షం పడితే కొంతమేర వాతావరణం చల్లబడే అవకాశం ఉంటుంది.





బుచ్చినాయుడుకండ్రిగ: నిర్మానుష్యంగా ఉన్న మెయిన్ రోడ్డు, (ఇన్‌సెట్) వడదెబ్బకు గురై ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

వేడుకగా హనుమాన్ జయంతి


కీళపూడి: విశేషాలంకరణలో


బుచ్చినాయుడు కండ్రిగలో..


శ్రీ అభయాంజనేయ స్వామి


శ్రీకాళహస్తీశ్వరాలయంలో...


కీళపూడి: అభయాంజనేయ స్వామి

- ఉదయం ఆంజనేయస్వామి ఆలయాల్లో పాలాభిషేకం
- కీళపూడి ఆలయంలో వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు
- మధ్యాహ్నం అన్నదానం, రాత్రి పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు


కీళపూడి అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ పారాయణం పఠిస్తున్న భక్తులు


శ్రీకాళహస్తి మండలం అక్కుర్తిలో హనుమాన్ జయంతి ఉత్సవాలు

పిచ్చాటూరు: మండలంలోని కీళపూడిలో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమన్ జయంతిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించి భక్తులు తమ స్వహస్తాలతో పాలాభిషేకం చేశారు. అలాగే భక్తులు హనుమాన్ చాలీసా పఠించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మంగళవాయిద్యాలు, కోలాట భజనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. హనుమజ్జయంతి సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు ఆంజనేయస్వామికి పూజలు చేశారు.

బీఎన్‌కండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు, కంచనపుత్తూరు, జోగికండ్రిగ, కల్లివెట్టు, పల్లమాల, నీర్పాకోట గ్రామాల్లో ఆదివారం శ్రీహనుమాన్ జయంతిని ఆంజనేయస్వామి భక్తబృందం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల విగ్రహాలకు అభిషేకాలు చేసి పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

రేణిగుంట: శ్రీకాళహస్తి దేవస్థానంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలోని 16 కాళ్ల మండపంలోని హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. తొలుత కలశస్థాపన, అనంతరం అభిషేక పూజలు చేపట్టారు. విగ్రహానికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి చందనంతో విశేషంగా అలంకరించారు. దీపధూప, నైవేద్యాలను సమర్పించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, వేద పండితులు మారుతీశర్మ, అర్చకులు తులసి పాల్గొన్నారు.

అన్నదానం

రేణిగుంట మండలం తారకరామానగర్లో ఆదివారం హనుమాన్‌జయంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. తారకరామానగర్ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణమూర్తి, పసుపులేటి రాజేష్, కాలేషా, తహసీనా, మాజీ ఎంపీటీసీ బుజ్జినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవం

శ్రీకాళహస్తి మండలం అక్కుర్తిలో వెలసిన అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి విగ్రహానికి షోడశ అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు జూలుగంటి సత్యనారాయణశెట్టి, మురళీమోహన్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది.

ప్రత్యేక పూజలు

తొట్టంబేడు మండలంలోని పెద్ద కన్నలి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామికి గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, పెద్ద కన్నలి యువత పాల్గొన్నారు.




తారకరామానగర్లో ఆంజనేయస్వామి


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి



తిరుపతి తుడా : క్రికెట్‌పై ఆసక్తి కలిగిన క్రీడాకారులు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని గ్యాస్ట్రాలజీ వైద్య నిపుణులు డాక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం ఎఫ్ఎఫ్‌సీఏ సమ్మర్ క్రికెట్ కోచింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రారంభమైన సమ్మర్ క్యాంపును సందర్శించారు. క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ హెడ్ కోచ్ మస్తాన్ ద్వారా మెళకువలు నేర్చుకుని రాణించాలని సూచించారు. కోచ్ ఎస్.మస్తాన్‌బాషా మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లో దాదాపు 100 మంది క్రికెట్ క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. మే 1వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ సమ్మర్ క్యాంప్ జూన్ 10వ తేదీ వరకు జరుగుతుందన్నారు.

కాసులు కురిపిస్తున్న చేపలు

- గంగ కాలువలో విరివిగా లభిస్తున్న చేపలు
- ముళ్ల కర్రలతోనే పడుతున్న వైనం
- పలువురికి జీవనోపాధిగా మారిన చేపల అమ్మకం

సత్యవేడు: ఊత్తుకోట–సత్యవేడు సమీపంలోని తెలుగుగంగ కాలువ జీరోపాయింట్ వద్ద జాలర్లు వేస్తున్న వలలకు చేపలు విరివిగా చిక్కుతుండడంతో గంగ కాలువ చేపలు జాలర్లకు కాసులు కురిపిస్తున్నాయి. ఆంధ్రా నుంచి తమిళనాడుకు వెళ్తున్న గంగ కాలువ సత్యవేడు సమీపంలోని జీరో పాయింట్ ఫ్లూమ్ వద్ద కాలువ వెడల్పు తక్కువగా ఉండడంతో చేపల వల కట్టేందుకు అనువుగా ఉంది. ఫ్లూమ్ నీటి మట్టానికి అరడుగు ఎత్తున వలలను జాలర్లు అమర్చడంతో నీటిలో ఎగిసిపడే చేపలు వలలకు చిక్కుతున్నాయి. సమీప గ్రామాలకు చెందిన గిరిజనులు ముళ్లకర్రలతో సులువుగా చేపలను పడుతున్నారు. ఆశించిన మేరకు చేపలు దొరుకుతుండడంతో రోజూ వాటిని బయటి గ్రామాలకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. వచ్చిన ఆదాయంతో పొట్ట పోసుకుంటున్నారు.


గంగకాలువ గట్టుపై నుంచి చేపలు పడుతున్న గిరిజనులు

చేపలకు గిరాకీ బాగుంది..



గంగకాలువలో దొరికే చేపలకు గిరాకీ బాగుంది. వలకు చిక్కిన చేపలు అప్పటికప్పుడే అమ్ముడు అవుతాయి. చేపలు తాజా గా ఉండడంతో వాటిని కొనుగోలు చేయడానికి జనం ఆసక్తి చూపుతారు. రోజుకు 10 కిలోల వరకు అమ్ముడవుతాయి.

– రాము, అంబాకం

కూలీ గిట్టుబాటు అవుతోంది..



చెరువుల్లో చేపలు తక్కువగా దొరుకుతుండడంతో గంగ కాలువలో చేపలు పట్టేందుకు వస్తున్నాం. ఇక్కడ కాలువలో ఎక్కువగా ముళ్లకర్రలకు చేపలు చిక్కుతున్నాయి. ఈ చేపలను తీసుకెళ్లి అమ్ముకుంటున్నాం. తద్వారా మాకు రోజు కూలి గిట్టుబాటు అవుతోంది. – శాంతి, పేరడం

గంగమ్మ సల్లగా చూస్తోంది..



ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంగ కాలువ గట్టుపై ఉండి చేపలు పడతాం. వాటిని తీసుకెళ్లి ఊత్తుకోటలో అమ్ముకుంటే మాకు రోజూ రూ.300 వస్తోంది. రోజూ సైకిల్ పైకి వచ్చి ఇక్కడ చేపలు పట్టుకెళ్తున్నాం. గంగమ్మ మమ్మల్ని సల్లంగా చూస్తా ఉంది. – వెంకటేశం, పేరడం




ఫ్లూవద్ద గంగ కాలువపై అమర్చిన వలలు


యోగాతో మెరుగైన ఆరోగ్యం


కాయంలో యోగా కేంద్రం ప్రారంభిస్తున్న పర్యాటక శాఖ మంత్రి రోజా

వడమాలపేట : యోగా ఆరోగ్యానికి చాలా మంచిదని, ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో ప్రతి రోజు చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కాయం గ్రామంలో ది వరల్డ్ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్–విలేజ్ సర్వీస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాసనాలు మానవ శరీరంలో అవయవాలకు మంచి ప్రేరణ కలిగిస్తాయన్నారు. ఆరోగ్యవంతమైన జీవనం, విద్యాభివృద్ధి, పరిసరాల పరిశుభ్రత, వయోవృద్ధుల పరిరక్షణకు, మహిళా సంరక్షణ కోసం చాలా అవసరమన్నారు. సౌత్ ఇండియా ఫిలిం అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి మాట్లాడుతూ కుటుంబ శాంతి, ధర్మబద్ధమైన జీవనం, మానవలక్ష్యం, మత సామరస్యానికి ఈ ధ్యానం చాలా తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, కాణిపాకం బోర్డు మెంబర్ ప్రతిమ, డీసీసీబీ బ్యాంక్ డైరెక్టర్ కరుణాకర్ చౌదరి, పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి, కాయం సింగిల్‌విండో అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ సురేష్‌రాజు, కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, జిల్లా బీసీ కార్యదర్శి సదాశివయ్య, జిల్లా పార్టీ కార్యదర్శి ఉమాపతి, సదాశికోన బోర్డు మెంబర్ కమల, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కిరణ్ పాల్గొన్నారు.







దుక్కి దున్నుతున్న రైతు



ఖరీఫ్ సాగులో నిమగ్నం



వరి నాట్లు వేస్తున్న కూలీలు

– పొలాలను దుక్కులు చేయిస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి, కల్లివెట్టు, పల్లమాల, వేణుగోపాలపురం, చిన్నయిగుంట, తహోనగర్, పూసలపల్లి, కాటూరు, మెస్టువరత్తూరు, కనమనంబేడు, పల్లమాల, ఆర్.అనంతాపురం, ఆలత్తూరు, గ్రామాల్లోని రైతులు ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 4 వేల ఎకరాల్లో వరి పంట, 5 వేల ఎకరాల్లో వేరుశనగ పంట రైతులు సాగు చేస్తారు. ప్రస్తుతం రైతులు వరినాట్లు, వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. భూములను దుక్కిదున్ని వరినాట్లు వేస్తున్నారు. వేరుశనగ సాగులో భాగంగా భూములను దుక్కులు చేయడానికి మడకలకు డిమాండ్ ఏర్పడింది. మిరప పంట చివరి దశకు చేరుకోవడంతో కోతలకు సిద్ధం అవుతున్నారు. మామిడితోటల్లో కాయలకు పురుగులు చేరకుండా మందులను పిచికారీ చేస్తున్నారు.

తెలుగు గంగనీటిని అందించాలి..

ఖరీఫ్ సీజన్‌లో పంటలకు తెలుగుగంగనీటిని అందించాలి. ఐదు నెలలుగా వర్షాలు లేకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో పంటలకు నీరుచాలక ఎండిపోతాయి. గంగనీటిని అందించి పంటలను కాపాడాలి.

– వెంకటకృష్ణయ్య, రైతు, బుచ్చినాయుడుకండ్రిగ

సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాలి

ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేయటానికి వరి, వేరుశెనగ విత్తనాలను సబ్సిడీపై ప్రభుత్వం పంపిణీ చేయాలి. మార్కెట్‌లో వరి, వేరుశెనగ విత్తనాలు ధర ఆకాశాన్ని అంటున్నాయి. రబీ సీజన్ మాదిరే ఖరీఫ్ సీజన్‌లో సబ్సిడిపై విత్తనాలను పంపిణీ చేయాలి.

– ప్రసాద్, రైతు, నెలవాయి

ఆరుతడి పంటలను సాగు చేయండి

ఖరీఫ్ సీజన్‌లో ఆరుతడి పంటలను సాగు చేయాలి. ఖరీఫ్‌లో వర్షాలు ఎక్కువగా పడవు. నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలను సాగుచేస్తే బాగుంటుంది. పంటలకు సేంద్రియ ఎరువులను ఎక్కువగా వాడాలి. ప్రతి ఒక్కరూ భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించాలి. అలాగే పంటల ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలి.

– భారతి, ఏఓ

పాహిమాం పరమేశ్వరి..



విశేషాలంకరణలో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా ఐదవ రోజు ఆదివారం అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కరుణించి కాపాడు తల్లీ అంటూ మొక్కుకున్నారు. కైకాల కులస్తులు మాతంగి వేషం ధరించి నగరంలో పూజలు అందుకున్నారు. స్థానికులు సైతం మాతంగితోపాటు వివిధ జానపద, స్త్రీ వేషాలు ధరించి డప్పుల దరువుల మధ్య చిందులు వేస్తూ ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చాలామంది గంగబొట్లు పెట్టుకొని, నడుముకు వేపాక కట్టుకుని వేయి కళ్ల దుత్తలు సమర్పించారు. కొందరు కుటుంబ సమేతంగా పొంగళ్లు పెట్టారు. అమ్మవారి మూలవిరాట్టుకు విశేష పూజలు చేసి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కుమార్తె భూమన నీహా దుర్గ వేషధారణతో అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు సున్నపు కుండల వేషాలు, సప్పరాలు

తాతయ్యగుంట గంగమ్మ జాతరలో ఆరవ రోజు సోమవారం ఇద్దరు కైకాల కులస్తులు సున్నపు కుండల వేషాలు ధరిస్తారు. వీరు పెద్దగంగమ్మ, చిన్నగంగమ్మకు ప్రతీకలుగా ప్రతి ఇంటా పూజలు అందుకుంటారు. సున్నం పూసి, కుంకుమ బొట్లు పెట్టిన కుండ కింద చిన్న రంధ్రం ఏర్పరచి కుండ అంచున మూరెడు పొడవు వెదురు పుల్లల్ని కడుతారు. పసుపు చీర, రవికె, కొమ్ములు, పెద్ద కమ్మలు పెట్టుకుని ఒడిబాలుతో మంగళవాయిద్యాలు, పంబల వాయిద్యాలతో పాటలు పాడుతూ ఇంటింటికీ వెళ్లి పూజలు అందుకోవడం ఆనవాయితీ. భక్తులు సప్పరాలు ధరించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకోనున్నారు.

నేటి అర్ధరాత్రి గంగమ్మకు ప్రత్యేక అభిషేకాలతో శాంతి

అమ్మవారి జాతర చాటు మొదలు మాతంగి వేషం రోజు వరకు విభిన్నరీతుల్లో చిత్ర విచిత్ర వేషధారణలతో అలసిన గంగమ్మను శాంతింపజేసేందుకు సోమవారం అర్ధరాత్రి 12.15 గంటలకు ప్రత్యేక అభిషేకం చేస్తారు. క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, నారికేళ జలాభిషేకం, పసుపు నీటితో అభిషేకం ఇలా అనేక మంగళద్రవ్యాలతో అభిషేకం చేస్తారు. అనంతరం అర్చకులు అమ్మవారికి విశేష పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తారు.



భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయం









మాతృమూర్తుల పాదాలకు పాలాభిషేకం


వరదయ్యపాలెంలో తల్లుల పాదాలకు పాలాభిషేకం చేస్తున్న పిల్లలు

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో డైనమిక్ పౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాతృమూర్తుల పాదాలకు పాలాభిషేకం చేసి ఆశీస్సులు పొందారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డైనమిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొప్పన శ్రీనివాసులు అమ్మ గొప్పతనాన్ని, త్యాగాలను వివరించారు. యువత చెడు ప్రభావాలకు గురై తల్లిదండ్రులను మానసిక ఆందోళనకు గురి చేస్తున్నారని, అలాంటివి దూరం కావాలని కోరారు. అనంతరం అమ్మకోసం పేరుతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన తల్లులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇందిరానగర్ సర్పంచ్ వీరభద్రం, యోగా గురువు సురేష్ నాయుడు, సామాజిక సేవకర్తలు ఇనుప రాజేంద్ర, సుబ్బరామయ్య, బాబు, లక్ష్మీనారాయణ, మాడ స్వామి, దేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



బడీడు పిల్లలను బడిలో చేర్చాలి


నచ్చనేరి ఎస్టీ కాలనీలో బడిఈడు పిల్లల తల్లిదండ్రులకు సూచనలిస్తున్న అరుణ

ఏర్పేడు: బడీడు పిల్లలను బడిలో చేర్చాలని యువనేస్తం అసోసియేషన్ మండల కో–ఆర్డినేటర్ అరుణ తెలిపారు. మండలంలోని నచ్చనేరి, మునలిపేడు బత్తెనయ్య ఎస్టీ కాలనీల్లో ఆదివారం బడిఈడు పిల్లలను గుర్తించారు. ఆమె మాట్లాడుతూ ఎస్టీ గ్రామాల్లో తల్లిదండ్రులు పిల్లలను చదువుకు దూరంగా ఉంచుతున్నారని చెప్పారు. తమవెంట అడవులకు తీసుకుని వెళ్లి ఈతాకు, బూరగ బంక తీయడంలాంటి పనులు చేయిస్తున్నారని గుర్తుచేశారు. బడిఈడు పిల్లలను వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఉన్నట్లు వివరించారు. ఉచితంగా పుస్తకాలు, టై, బ్యాగ్, షూ, సాక్స్‌లు అందజేస్తున్నట్లు విరించారు. ప్రభుత్వ బడుల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. యువనేస్తం అసోసియేషన్ వలంటీర్లు లక్ష్మీ, తులసి, స్రవంతి, స్వాతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుల తల్లులకు సన్మానం


తల్లులను సన్మానిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

తొట్టంబేడు(రేణిగుంట): పట్టణంలోని హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగుల తల్లులకు మాతృదినోత్సవం సందర్భంగా సన్మానం చేశారు. జీవితాంతం వారు చేసే సేవలను గుర్తించి వారికి సన్మానం చేసి దుప్పట్లు, పండ్లు సంస్థ అధినేత మునీర్ బాషా అందించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి రోజు దివ్యాంగులకు సేవలు చేసే తల్లులే ఈ ప్రపంచంలో గొప్ప వాళ్లని కొనియాడారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, బాబా ఫరీద్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం


పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2002–03 ఏడాది పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు పాఠశాలలో సమావేశమై అలనాటి చిలిపిచేష్టలు, తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను పూలమాలలు శాలువలతో సన్మానించి వారి ఆశీర్వాదాన్ని పొందారు. విరాళాలు సేకరించి పాఠశాల అభివృద్ధికి దోహదపడతామని సమావేశంలో చర్చించుకున్నారు.

అంబలి పంపిణీ


ఆటో కార్మికులకు బట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రామచంద్రారెడ్డి

తిరుచానూరు (చంద్రగిరి): దామినేడు ఇందిరమ్మ హౌసింగ్ కాలనీలోని ఆటో స్టాండ్ వద్ద ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తిరుపతి గంగజాతర సందర్భంగా కాలనీ ప్రజలకు అంబలి పంపిణీ చేశారు. తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఏఐటీయూసీ చంద్రగిరి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ యోగానందరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆటో డ్రైవర్లకు బట్టలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ తిరుచానూరు పంచాయతీలో సుమారు 500 మందికి పైగా ఆటో కార్మికులు ఉన్నారని, వారికి అండగా ఏఐటీయూసీ యూనియన్ సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఆటో యూనియన్ నాయకులు వెంకటేష్‌రెడ్డి, దయానంద్, సుబ్రహ్మణ్యం పిళ్లై, వాసు, వెంకీ, దాము, సురేష్, శ్రీనివాసులు, లక్ష్మీ, ఇందిరమ్మ హౌసింగ్ కాలనీ వాసులు పాల్గొన్నారు.









